క్లుప్తంగా

గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్



అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్లు

గొల్లప్రోలు: మండలంలోని చెందుర్తిలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు సోమవారం సీజ్ చేశారు. వివరాల్లోకి వెళితే... చెందుర్తి గ్రామ పొలిమేర గల పోలవరం కాలువ గట్టును తవ్వి ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు దాడి చేశారు. ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు పట్టుకుని గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాటాకిల్లు దగ్ధం



ప్రమాదంలో కాలిబూడిదైన తాటాకిల్లు

గొల్లప్రోలు: మండలంలోని కొడవలిలో సోమవారం గ్యాస్ సిలిండర్ పేలి తాటాకిల్లు దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే... గ్రామంలోని పోలవరపు చంద్రరావు తాటాకింట్లో ఉదయం 8.30 గంటలకు గ్యాస్ సిలిండర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఏడు కాసుల బంగారం, రూ.లక్ష నగదుతో పాటు వంట సామగ్రి, దుస్తులు, ఇతర సామగ్రి కాలి బూడిదైనట్టు బాధితులు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల ఆస్తినష్టం జరిగింది. ప్రమాద సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. దీనిపై బాధితుడు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

వైభవంగా సీబీదేవం వేంకటేశ్వర కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న సీబీదేవం వేంకటేశ్వర స్వామివారు

పెద్దాపురం: మండలంలోని చినబ్రహ్మదేవం గ్రామంలోని అలివేలు మంగా పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామస్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు కల్యాణోత్సవాలు జరుగుతాయి. ఇందులో భాగంగా సోమవారం ఉదయం లక్ష తులసి పూజ, రాత్రి దివ్య కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలు, చలువ పందిళ్లతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ కల్యాణోత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజల్లో భాగస్వాములయ్యారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

కొత్తపల్లి: రైతులకు నాణ్యమైన వరి విత్తనాలను అందించాలని ఎరువులు, పురుగు మందుల దుకాణాల డీలర్లకు మండల వ్యవసాయాధికారి జోగిరాజు సూచించారు. మండలంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలను ముందుగా పరీక్షించి 80 శాతం కన్నా ఎక్కువ మొలకెత్తిన విత్తనాలనే రైతులకు సరఫరా చేయాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు అందించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా, డీఏపీ, ఎంపీఓ, ఎస్ఎస్‌పీతో పాటు కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు.

వాణిజ్య పంటల సాగు..

జాగ్రత్తలతో దిగుబడి బాగు

- భూములను సిద్ధం చేస్తున్న రైతులు
- నారుమళ్లు వేయడంలో బిజీబిజీ
- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న ఉద్యాన శాఖ సిబ్బంది



గొల్లప్రోలు మండలంలో మిరప సాగుకు దుక్కు చేస్తున్న రైతు

పిఠాపురం: వాతావరణం చల్లబడటంతో రైతులు ఖరీఫ్ సాగు పనులకు శ్రీకారం చుట్టారు. వాణిజ్య పంటలకు పుట్టినిల్లయిన పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు మండలంలో వాణిజ్య పంటల సాగు ప్రారంభమైంది. రైతులు నారు మళ్ల వేసే పనిలో ఉన్నారు. కాగా పంటల సాగులో కీలక దశ విత్తనం నాటడం. విత్తనాల ఎంపికపైనే పంటల దిగుబడి ఆధారపడి ఉంటుంది. మంచి విత్తనం నాటితే సగం ఖర్చు తగ్గించుకున్నట్లే. అలాగే విత్తనం నాటే ముందు జాగ్రత్తలు పాటిస్తే మరింత మేలు జరుగుతుంది. విత్తనం నాటే దశలో జాగ్రత్తలు పాటించడం ద్వారా తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అందుకే విత్తు నాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, విత్తన శుద్ధి చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో ఉద్యాన శాఖ అధికారులు పర్యటించి విత్తన శుద్ధి, నాట్లు వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

నారుమళ్లు రెడీ

గొల్లప్రోలు మండలంలోని రైతులు ఇప్పటికే సాగు పనులు ప్రారంభించారు. వాణిజ్య పంటలైన మిరప, వంగ, టమాటా, బీర, బెండ తదితర పంటలకు నారుమళ్లు వేస్తున్నారు. కాగా నారుమళ్లు, నాట్లు వేసే సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పిఠాపురం ఉద్యాన శాఖాధికారి కేఎస్ శైలజ వివరించారు.



కెఎస్ శైలజ

జాగ్రత్తలు ఇలా..

కిలో విత్తనాలకు 3 గ్రాముల థైరమ్ , కేప్టన్ కలిపి శుద్ధి చేసుకోవాలి. విత్తనాలను ఎత్తయిన (15 సెంటీ మీటర్ల) నారు మడులలో మాత్రమే సాగు చేయాలి. ఇలా చేయడం ద్వారా భారీ వర్షాలు పడినా నీరు నిల్వ ఉండకుండా నారును రక్షించుకోవచ్చు. తెగుళ్లు రాకుండా నారుమళ్లలో బైటాక్స్ 3 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి 2 నుంచి 3 సార్లు పిచికారీ చేసుకోవాలి. విత్తనాలను షేడ్ నెట్‌లలో పెంచుకోవడం ద్వారా మొక్క తొలి దశలోనే కీటకాల ద్వారా వ్యాపించే వైరస్, తెగుళ్లు రాకుండా కాపాడుకోవచ్చు. ఎక్కువ మొలక శాతం ఉన్న విత్తనాలనే వినియోగించాలి.

మిరపనారు పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

విత్తనాలను థైరమ్ , కేప్టన్ కలిపి శుద్ధి చేసుకోవాలి. ఎత్తయిన ప్రదేశాల్లో నారు వేసే ముందు క్లోరిపైరీపాస్ 2 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి కలిపి నారుమడి బాగా తడిచేలా పిచికారీ చేసుకోవాలి. నారుమడిని కచ్చితంగా షేడ్ నెట్‌లో పెంచుకోవడంతో పాటు నెట్‌లు కనీసం రెండు అడుగులు ఎత్తుగా ఉండేలా చూసుకోవాలి. నారుమడిలోకి కీటకాలు వెళ్లలేని విధంగా నెట్‌ను ఏర్పాటు చేసుకోవాలి. నారుమడితో పాటు పంట వేసే పొలంలో వేపపిండి వేసుకోవాలి. ఫిప్రోనిల్ గ్రాన్యూల్స్ 8 కేజీలు ఎకరానికి వేసుకోవాలి. నీలి రంగు జిగురు అట్టలను పొలంలో తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి.

రామకృష్ణుని బోధనలు అనుసరణీయం



ఆధ్యాత్మిక బోధనలు చేస్తున్న స్వామీజీలు

సామర్లకోట: రామకృష్ణుని బోధనలు సదా అనుసరణీయమని కడప రామకృష్ణ మిషన్ స్వామి అనుపమానంద మహరాజ్, రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ స్వామి సేవ్యానంద మహరాజ్ అన్నారు. పీబీ దేవం గ్రామంలో శ్రీ శారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యాన సోమవారం సాయంత్రం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా రామకృష్ణుని ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రజల మనస్సులను సుసంపన్నం చేశాయన్నారు. స్వామి వివేకానందుడిని అందించి, యావత్ భారత్ జాతినే కాకుండా చికాగో విశ్వవేదికపై నుంచి యావత్ ప్రపంచం మనవైపు చూసేలా చేశారని తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి గౌరవాధ్యక్షుడు వింజమూరి సుబ్రహ్మణ్యశర్మ, కార్యదర్శి విశ్వనాథ్, సభ్యులు తెలుగుంట్ల నరసింహరావు, నువ్వుల వెంకట్రాజు, సూర్యచంద్రరావు, బాబ్జీ, తోటకూర సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు

- మండిపోతున్న ఎండలు
- అల్లాడుతున్న ప్రజలు



ఎండకు నిర్మానుష్యంగా మారిన ఉప్పాడ-పిఠాపురం రోడ్డు



జనసంచారం లేని కొత్తపల్లి-గోర్స జంక్షన్



ఎండకు వెలవెలబోతున్న కొత్తపల్లి సెంటర్

కొత్తపల్లి: నియోజకవర్గంలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 8 గంటలకే సూరీడు సుర్రుమనిపిస్తున్నాడు. భానుడు ప్రతాపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు పిల్లలు, పెద్దలు సముద్ర తీరాలకు చేరుకుంటున్నారు. జూన్ నెలలో 15 రోజులు గడిచినా ఇంకా తొలకరి పలకరించలేదు. సోమవారం ఎండ తీవ్రత మరింత ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. తప్పని పరిస్థితుల్లో బయటకు వెళ్లే ప్రయాణికులు ముఖానికి ముసుగు, తలకు టోపీ పెట్టుకుని ప్రయాణించారు. ఎండతాపం నుంచి రక్షించుకునేందుకు ప్రజలు శీతల పానియాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో జ్యూస్‌లు, కూల్‌డ్రింక్‌లు, కొబ్బరి బొండాల దుకాణాలు కళకళలాడుతున్నాయి. కాగా వర్షాలు పడితే ఖరీఫ్ సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు.

డయేరియా రోగులకు పరామర్శ



కొమ్మనాపల్లిలో డయేరియా బాధితులను పరామర్శించిన డీఎంఅండ్‌హెచ్‌ఓ నరసింహనాయక్

తొండంగి: మండలంలోని కొమ్మనాపల్లిలో డయేరియా రోగులను జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి నరసింహనాయక్ సోమవారం పరామర్శించారు. కొద్ది రోజులుగా గ్రామంలో పలువురు వాంతులు విరోచనాలతో డయేరియా బారినపడి పలు ఆస్పత్రుల్లో చేరి వైద్యం పొందుతున్నారు. వీరిలో ఓ వివాహిత మృతి చెందిన సంగతి విదితమే. కాగా సోమవారం కూడా 10 కేసులు నమోదయ్యాయని ఏవీ నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్ తెలిపారు. ఇప్పటివరకూ 100 మంది డయేరియా బాధితులను గుర్తించారు. వీరంతా పిఠాపురం, కాకినాడ జీజీహెచ్, కత్తిపూడి, గొల్లప్రోలు తదితర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో వైద్యం పొందుతున్నారు. డయేరియా ప్రబలిన నేపథ్యంలో గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి రోగులకు వైద్యం అందిస్తున్నారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ నరసింహనాయక్ వైద్యశిబిరంలో రోగులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పర్యటించి డయేరియా నివారణపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సరిత, వైద్యులు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

శృంగార వల్లభునికి ఎమ్మెల్యే రాజప్ప పూజలు



శృంగార వల్లభ స్వామి ఆలయంలో మొక్క నాటుతున్న పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం: తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయంలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. సోమవారం నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పోలవరం పర్యటన విజయవంతం కావాలని, త్వరలోనే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావాలంటూ చిన రాజప్ప పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో ఎమ్మెల్యే రాజప్ప మొక్కలు నాటారు. ఆయన వెంట కొత్తెం వెంకట శ్రీనివాసరావు, సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, కొమ్మిరెడ్డి బుజ్జి, బందిలి సుబ్రహ్మణ్యం, మత్తాల రాజు తదితరులు పాల్గొన్నారు. కాగా సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం సాధించడంతో టీడీపీ మండలశాఖ అధ్యక్షులు కోటి మొక్కులో భాగంగా తులాభారం నిర్వహించారు. అనంతరం జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు జన సైనికులతో కలసి విడిగా స్వామి వారిని దర్శించుకున్నారు.

నృత్యకళాకారుడు అలమండ ప్రసాద్‌కు సత్కారం



అలమండ ప్రసాద్‌ను సత్కరించిన రాష్ట్ర అఖిల గాండ్ల తెలుకుల సంఘ నాయకులు

సామర్లకోట: పలు దేశాల్లో నృత్య ప్రదర్శనలు ఇచ్చి అలరిస్తున్న సామర్లకోటకు చెందిన కళాకారుడు అలమండ ప్రసాద్‌ను రాష్ట్ర అఖిల గాండ్ల తెలికుల సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. నెల్లూరులోని దేవిశెట్టి స్వాములు కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గ్లోసు గోపాలయ్య మెమోరియల్ గోల్డ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టెన్త్, ఇంటర్ మెరిట్ విద్యార్థులకు గోల్డ్ మెడల్ స్కాలర్‌షిప్‌లు అందజేశారు. అఖిల గాండ్ల తెలికుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గ్లోసు సుబ్బారావు అధ్యక్షతన అలమండ ప్రసాద్‌ను సత్కరించారు. అలమండ ప్రసాద్ కూడిపూడి సత్యంలో రాణిస్తున్న తీరును ఈ సందర్భంగా సంఘ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, సినీ నటుడు మొల్లేటి బాలాజీ, రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు నరవ అనంతం, ప్రధాన కార్యదర్శి బొర్లా మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



నాగులపల్లి పీహెచ్‌సీలో రోగులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సౌజన్య

కొత్తపల్లి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగులాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సౌజన్య సూచించారు. మండలంలోని నాగులపల్లి పీహెచ్‌సీలో సోమవారం ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడిస్ దోమ వల్ల డెంగీ వ్యాధి వ్యాప్తి చెందుతున్నారు. ఈ దోమ పగటి పూటే కుడుతుందన్నారు. డెంగీ సోకితే ఒళ్లునొప్పులు, కళ్లు లాగడం, వాంతులు, చలి జ్వరం, పంటి చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ లక్షణాలు గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ సీజన్‌లో దోమల నియంత్రణకు దోమ తెరలు, మస్కిటో కాయిల్స్ వినియోగించాలని సూచించారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్



బక్రీద్ సందర్భంగా సామర్లకోట జూనియర్ కళాశాల ఆవరణలో మత గురువు ఆధ్వర్యంలో ముస్లింల ప్రార్థనలు



పెద్దాపురంలో బక్రీద్ ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

సామర్లకోట: ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు జరుపుకొన్నారు. పట్టణ పరిధిలోని మసీదుల్లో తెల్లవారుజాము నుంచి ముస్లింలు ప్రార్థనలు చేశారు. పిఠాపురం రోడ్డులో ఉన్న మసీదుల్లో ముస్లిం మతగురువుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రార్థనలో పాల్గొన్నారు. పిఠాపురం రోడ్డు, పోలీసుస్టేషన్ ఎదురుగా, కోటమ్మ చెరువు వద్ద ఉన్న దర్గాలోను ముస్లింలు ప్రార్థనలు చేశారు. మసీదులు ఆయా ప్రాంతాల్లో ముస్లింలు మత గురువులు బక్రీద్ ప్రార్థనలు చేసి బక్రీద్ ప్రాధాన్యతను వివరించారు. బక్రీద్‌ను పురస్కరించుకొని ముస్లింలు మాంసం, పిండి వంటలను ఇతరులకు పంచారు. ఆయా ప్రదేశాలు సెంటువాసనతో ఘుమఘుమలాడాయి. ముస్లిం సంఘ నాయకులు రిజ్వాన్, బాషీ, ఎండీ తహీర్, ఎండీ మునీర్, ఎండీ తాజుద్దీన్, అబ్దుల్ జిలాల్, ఎండీ హబీబుల్లా, ఎండీ మున్వార్, ఎండీ షోయబ్, ఎండీ సైపుల్లా ప్రార్థనల్లో పాల్గొన్ని ముస్లిం సోదరులకు సేవలందించారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: పవిత్ర ఈదుల్ జహా (బక్రీద్) వేడుకలను పట్టణంలోని ముస్లింలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కబడ్డీ వీధి, దర్గాపేట, ఆసుపత్రి రోడ్డు మసీదుల్లో ఈద్ నమాజ్ ఆచరించారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మత బోధ బోధించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ సృష్టికర్త ఆదేశానుసారం తన త్యాగనిరతిని నిరూపించుకున్న ప్రవక్త ఇబ్రహీం మార్గాన్ని ప్రతి ముస్లిం ఆచరించాలన్నారు. నమాజ్ దువ్వా అనంతరం ముస్లింలు ఒకరినొకరు అలింగనం చేసుకుని ఈద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ఆయా మసీదుల పరిధిలోని ముస్లింలు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



ఏలేశ్వరంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపిస్తున్న పండితులు



కల్యాణం తిలకిస్తున్న భక్తులు

- కన్నులపండువగా సత్యనారాయణస్వామి కల్యాణం
- వేలాదిగా తిలకించిన భక్తులు

ఏలేశ్వరం: స్థానిక ఏలేరు నది ఒడ్డున వేంచేసిన అనంతలక్ష్మీ సమేత సత్యనారాయణస్వామివారి వార్షిక కల్యాణం సోమవారం కన్నులపండువగా జరిగింది. అన్నవరం దేవస్థానం ఈఓ కె.రామ్‌చంద్రమోహన్, చైర్మన్ ఐవీ రోహిత్ నేతృత్వంలో పండితుడు పెద్దింటి గోపాలకృష్ణాచార్యులు, పొన్నూరు సత్యనారాయణచార్యులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా జరిపారు. స్వామివారి కల్యాణాన్ని తిలకిచేందుకు పట్టణం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కల్యాణం సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో వేద పండితులు వేదుల సూర్యనారాయణశర్మ, అమరేశ్వర అవధాని, అర్చకులు కంచిబొట్ల రామ్‌కుమార్, ఇంద్రగంటి పవన్‌కుమార్, మున్సిపల్ కౌన్సిలర్ మూది నారాయణస్వామి దంపతులు, ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు, ఒబిణ్ణి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాబోయే లయన్స్ గవర్నర్‌కు సన్మానం



లయన్స్ క్లబ్ గవర్నర్ ఎన్నికైన ఈదల ఈశ్వర కుమార్ దంపతులను సత్కరించిన క్లబ్ సభ్యులు

సామర్లకోట: లయన్స్ క్లబ్ సామర్లకోట శాఖకు తొలిసారి గవర్నర్ పదవి లభించింది. లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్‌గా జిల్లా చైర్మన్ ఈదల ఈశ్వరకుమార్ నియమితులయ్యారు. క్లబ్ గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసేందుకు ఆయన ఈ నెల 22న ఆస్ట్రేలియాకు బయలుదేరి వెళుతున్నారు. ఈ సందర్భంగా సోమవారం రాత్రి సామర్లకోట లయన్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ఈశ్వర్‌కుమార్ దంపతులను క్లబ్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కానుబోయిన విజయకృష్ణ , ప్రతినిధులు గుండు శంకరరావు, కర్రి ఆదినారాయణరెడ్డి, అమలకంటి శ్రీనివాసరావు, విజయ భాస్కరరెడ్డి, చిత్తూలూరి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి వెండి కిరీటాల వితరణ



వల్మీక వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఉత్సవ విగ్రహాలకు వెండి కిరీటాలు అందజేస్తున్న దాతలు

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వల్మీక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు భక్తులు నాలుగు వెండి కిరీటాలను వితరణ చేశారు. వివరాల్లోకి వెళితే.. కోరుకొండకు చెందిన శ్రీ షిర్డీ సాయి విద్యాసంస్థ, శీలది గ్లోబల్ స్కూల్ యాజమాన్యం సభ్యులు ఈ వెండి కిరీటాలను సోమవారం ఆలయానికి అందజేశారు. అర్చకులు కృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవ విగ్రహాలకు వెండి కిరీటాలను అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పులగం కృష్ణప్రసాద్, పులగం నరసింహారావు, దాతలు శీలది గ్లోబల్ స్కూల్ డైరెక్టర్ జి.లక్ష్మీపద్మావతి, శ్రీషిర్డీ సాయి స్కూల్ కరస్పాండెంట్ శ్యామల, శ్రీదేవి, ఫణి, లక్ష్మి, చంటి, శ్రీనివాస్, సాయి తదితరులు పాల్గొన్నారు.